www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 27 మార్చి 2024 5

ఏలూరు



## ఉత్తమ పురస్కారాలకు డిఐజి, ఎస్‌పి ఎంపిక

**ఏలూరు స్పోర్ట్స్:** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖచే ఇవ్వబడే డిజిపి కమాండేషన్ డిస్క్ అవార్డులకు ఏలూరు రేంజ్ డిఐజి ఐజిపి అశోక్ కుమార్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతిలతోపాటు పలువురు పోలీసులు ఎంపికయ్యారు. ప్రతి ఏడాది ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పేరుతో డిజిపి కమాండేషన్ డిస్క్ అవార్డులను ఇస్తుంది. ఇందులో గోల్డ్ సిల్వర్ బ్రాంచ్ అనే 3 విభాగాలుగా అవార్డులను విభజించి రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన పోలీసులకు ఇచ్చేందుకు పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏలూరు రేంజ్ డిఐజిగా పనిచేస్తున్న ఐజిపి జివిజి అశోక్ కుమార్ గోల్డ్ విభాగంలో ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి సిల్వర్ విభాగంలో ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరితోపాటు ఏలూరు రేంజ్‌లో సిల్వర్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి జగదీష్, కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్‌లు ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఏలూరు జిల్లాలో ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు పలువురు ఈ అవార్డులకు ఎంపికయ్యారు.

# సీట్లు ఇవ్వం.. ఓట్లు వేయండి..!

**మహిళా సాధికారితపై తెగ ఉపన్యాసాలు దంచేసే టిడిపి, వైసిపి ఎన్నికల సీట్ల కేటాయింపులో మాత్రం మహిళల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించాయి. టిడిపి, జనసేన అత్యంత దారుణంగా వ్యవహరించగా, వైసిపి మాత్రం మహిళలకు ఒక్క సీటు ఇచ్చి మమ అనిపించింది. రెండు జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. అయినప్పటికీ మహిళలకు సీట్లు లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది.**

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై ఊదరగొట్టే పార్టీలు అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల కేటాయింపులపై సమాధానం చెప్పాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**



- మహిళ పట్ల టిడిపి, వైసిపి, జనసేన వివక్ష
- రెండు జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు లోకసభ స్థానాలు
- మహిళలకు ఒక్క ఎంఎల్ఎ, ఎంపీ సీటు కేటాయించని టిడిపి
- వైసిపి మాత్రం ఒక ఎంఎల్ఎ, ఒక ఎంపీ సీటుతో మమ
- రెండు జిల్లాలో అత్యధిక ఓటర్లు మహిళలే
- దాదాపు 30 లక్షల మంది ఓటర్లలో 16 లక్షకుపైగా మహిళా ఓట్లే

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

మాటకు ముందు.. మాటకు వెనుక మా అక్కచెల్లెమ్మలంటూ మాట్లాడే టిడిపి, వైసిపి అధ్యక్షులు రెండు జిల్లాలోని అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అత్యంత దారుణంగా వ్యవహరించిన పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. పొత్తులో భాగంగా టిడిపి అభ్యర్థులు తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి, నూజివీడు, చింతలపూడి, దెందులూరు, ఏలూరు మొత్తం ఎనిమిది స్థానాల్లో, ఉంగుటూరు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, పోలవరం మొత్తం ఐదు స్థానాల్లో జనసేన అభ్యర్థులు, కైకలూరులో ఒక్కచోట బిజెపి అభ్యర్థి పోటీ చేస్తున్నారు. మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో పొత్తుతో కలిసి పోటీచేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి ఏ ఒక్క పార్టీ నుంచి మహిళలకు ఒక్క అసెంబ్లీ సీటు కూడా కేటాయించని పరిస్థితి నెలకొంది. రెండు లోక్‌సభ స్థానాల్లో నరసాపురం నుంచి బిజెపి అభ్యర్థి, ఏలూరు నుంచి టిడిపి అభ్యర్థి పోటీ చేస్తున్నారు. లోకసభ స్థానాల్లోనూ మహిళలకు ఎటువంటి సీటూ కేటాయించలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా టిడిపి మహిళ పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించిన పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసిపి మాత్రం ఒక్కో సీటుతో మమ అనిపించిన పరిస్థితి. 14 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి పోలవరం టిక్కెట్ తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మికి కేటాయించగా, నరసాపురం లోకసభ స్థానంలో గూడూరి ఉమాబాలకు కేటాయించింది. లోకసభ స్థానాల్లో రెండింటిలో ఒకటి మహిళకు వైసిపి కేటాయించడం కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అసెంబ్లీ సీట్ల విషయంలో మాత్రం వివక్ష నెలకొంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన చూసిన రెండు జిల్లాలో నాలుగు నుంచి ఐదు స్థానాలు కేటాయించాల్సి ఉంది. ఎక్కడా అది అమలు కాలేదు. ఏలూరు జిల్లాలో మొత్తం 16,25,655 మంది ఓటర్లు ఉండగా అందులో 8,31,701 మంది అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14,58,832 మంది ఓటర్లకుగాను, 7,44,303 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రెండు జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్న పరిస్థితి. సీట్ల కేటాయింపులో మాత్రం మహిళలు పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. మహిళలకు ఉచిత ప్రయాణం, డ్వాక్రా రుణమాఫీ అంటూ హామీలు గుప్పించి ఓట్లు దండుకునేందుకు చూస్తున్న ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు చట్టసభల్లో మాత్రం మహిళలకు అవకాశం ఇచ్చేందుకు ముందుకు రాని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. మహిళా ఎంఎల్ఎలు లేకపోతే భవిష్యత్తులో జిల్లా పరిషత్, జిల్లా సమీక్షా సమావేశాల్లో మహిళల తరపున గొంతు వినిపించే అవకాశం లేకుండా పోనుంది. మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే ప్రధాన పార్టీలు భావిస్తూ ఒకటి, రెండు ఉచిత పథకాలు ప్రకటించి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయి. ఎంఎల్ఎ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన చోట సైతం భర్తలే పెత్తనం చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. టిడిపి, వైసిపిలు మహిళల గురించి చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకూ ఏ మాత్రమూ సంబంధం లేకుండా పోయింది. మహిళలు ఒక్కసారి తమశక్తిని చూపిస్తే ఇలాంటి పార్టీలకు జ్ఞానోదయం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.



# టార్గెట్.. 85 ఏళ్లు..!

- రెండు జిల్లాలో దాదాపు 16 వేల మంది ఓటర్లు
- వీరికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాసం
- 60 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరమని అధికారుల ప్రణాళిక
- వారి ఓట్ల కోసం రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నాలు
- పథకాలు నిలిపేస్తామంటూ అధికార పార్టీ బెదిరింపులు
- దృష్టి సారించని జిల్లా ఎన్నికల అధికారులు
- ఆందోళనలో వృద్ధులు వికలాంగులు

**ప్రజాశక్తి - భీమవరం**

రాబోయే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. పట్టణ, గ్రామాల్లో ఓటర్ల కోసం జల్లెడ పడుతున్నారు. ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి దగ్గర నుంచే వినియోగించే అవకాసం 85 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల సంఘం కల్పించడంతో వారిని రాజకీయ పార్టీలు టార్గెట్ చేశాయి. ఓటు తమ పార్టీకే వేయాలని కోరడంతో పాటు బేరసారాలు చేయడమే గాక ఓటు వేయకపోతే పథకాలు నిలిపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అయితే దీనిపై ఎన్నికల అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వయసు పైబడిన వృద్ధులు వికలాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సార్వత్రిక సమరంలో వజ్రాయుధం వంటి ఓటు హక్కును వినియోగించాలన్నది అందరి ఆకాంక్ష. కానీ వయసు మీరి.. శరీరం సహకరించక.. శారీరక వైకల్యంతో పోలింగ్ కేంద్రం వరకూ వెళ్లలేక బాధపడుతూ చాలా మంది దీన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. తాజా ఎన్నికల్లో వీరందరికీ ఎన్నికల సంఘం ఓ ఉపయుక్త కబురు చెప్పింది. 85 ఏళ్లు వయసు దాటిన ఓటర్లకు, గుర్తింపు పొందిన వికలాంగులకు, కోవిడ్ సోకి వైద్యం పొందుతున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఎన్నికల అధికారులకు వీరు దరఖాస్తు చేసుకుంటే అర్హులా, కాదా..? అనేది ఆర్ఓ విచారణ జరిపిన అనంతరం ఓటు హక్కు కల్పిస్తారు. జిల్లాలో పురుష ఓటర్లు 7,16,955 మంది, మహిళా ఓటర్లు 7,44,308 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 74 మంది, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు కలిపి 7,500 మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 8,488 మంది ఉన్నారు. రెండు జిల్లాల్లో వీరు 15,988 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓటర్లతో పాటు 41 శాఖల ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 60 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరం కానున్నాయని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా వయసు పైబడిన వృద్ధులకు వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి దగ్గర నుంచే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వారిని టార్గెట్ చేశాయి. ఏదో విధంగా ఓటు రాబట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. పూర్వ ఎన్నికల్లో కొన్నిచోట్ల పోస్టల్ బ్యాలెట్లు నయానా భయానో వేయించు కునే పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ సారి అధికార రాజకీయ పార్టీలు ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేయాలని హుకుం జారీ చేస్తున్న పరిస్థితి ఉంది.

**వాలంటీర్లతో బెదిరింపులు..**

ఎన్నికల విధుల్లో వాలంటీర్లను ఉపయోగించకూడదని ఎన్నికల సంఘం హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొందరు లెక్కజేయని పరిస్థితి. నేరుగా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన జిల్లాలో 13 మంది వాలంటీర్లు సైతం విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా వాలంటీర్లు లెక్క చేయడం లేదు. స్థానిక వాలంటీర్లు, నాయకులు కలిసి పింఛను తీసుకుంటున్న వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. గుర్తింపు కార్డు, పింఛను పుస్తకం జిరాక్సు తీసుకుంటున్నారు. వైసిపికి ఓటు వేస్తేనే పింఛను వస్తుందని చెబుతున్నారు. పోలింగ్ ప్రక్రియపై అవగాహనలేని కొందరు ఇది నిజమేనేమో అని నమ్ముతున్నారు. ఓటు వేయకపోతే పథకాలు నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. పింఛను డబ్బులు ఇవ్వొద్దంటూ వాలంటీర్లను ఆదేశిస్తున్నట్లు తెలిసింది. పింఛను రావాలంటే స్థానిక వైసిపి నాయకులను కలవాలంటూ సూచించి ఆయన వద్దకు పంపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వైసిపి ప్రభుత్వం వస్తే ఇంటికి పింఛను వస్తుందని, వేరే పార్టీ వస్తే రద్దు చేస్తారని వారిని మభ్య పెడుతున్నారు. అయితే ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే నెలలో వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు వీరే అందిస్తున్న తరుణంలో పోస్టల్ బ్యాలెట్ దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్న ఆందోళన వినిపిస్తోంది.

**పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంపై స్పష్టత కరువు**

85 ఏళ్లు వయసు పైబడిన వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కనిపించినప్పటికీ ఓటు వినియోగంపై ఇప్పటివరకూ కనీసం స్పష్టత ఇవ్వలేదు. పోస్టల్ బ్యాలెట్ ఓటు ఎన్నికల రోజు అధికారులు వెళ్లి వేయిస్తారా లేక ముందుగానే వేయిస్తారా అనేది స్పష్టత లేదు. వాస్తవానికి పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉద్యోగులు పోలింగ్‌కు ముందే వినియోగించుకుంటారు. ఈ విధంగా వృద్ధులు, వికలాంగుల చేత ముందే పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ఇచ్చి ఓటు వేయిస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై కూడా ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. అయితే రాజకీయ పార్టీలకు తెలియకుండా ఎన్నికల అధికారులు వయసు పైబడిన వికలాంగుల వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అయితే ఎప్పుడు వేయిస్తారో ఎలా వేయిస్తారా అనేదానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.

# బిజెపి అభ్యర్థి మాకొద్దు..!

- నరసాపురం ఎంపీ అభ్యర్థిత్వంపై టిడిపి,జనసేన ఎంఎల్ఎలు తిరుగుబాటు?
- మాజీ మంత్రి పితానితో ఎంఎల్ఎ అభ్యర్థులంతా అంతర్గత సమావేశం
- రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇవ్వాలంటూ పట్టు
- చంద్రబాబుతో ఫోన్లో పితాని మాట్లాడినట్లు సమాచారం
- మరోసారి పరిశీలిస్తామని చెప్పినట్లు ప్రచారం

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

'నరసాపురం లోకసభ బిజెపి అభ్యర్థి తమకొద్దంటూ ఆ పార్లమెంట్ పరిధిలోని టిడిపి, జనసేన అభ్యర్థులంతా తిరుగుబాటుకు దిగారా.. ఎంపీ రఘు రామకృష్ణంరాజుకు ఎంపీ సీటు ఇవ్వాలని టిడిపి అధిష్టానానికి తేల్చిచెప్పారా.. బిజెపి అభ్యర్థి బరిలో ఉంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని చంద్రబాబును హెచ్చరించారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. నరసాపురంలో లోకసభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని టిడిపి, జనసేన అభ్యర్థులంతా మంగళవారం మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణతో అంతర్గతంగా సమావేశమైనట్లు సమాచారం. ఈ సమావేశం అత్యంత గోప్యంగా సాగినట్లు తెలుస్తోంది. కనుమూరి రఘు రామకృష్ణంరాజును కాకుండా బిజెపి అధిష్టానం నరసాపురం ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మను ప్రకటించింది. దీంతో క్షత్రియ సామాజిక తరగతిలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రఘు రామకృష్ణంరాజు అయితే ఆర్థికంగా ఎంఎల్ఎ అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలబడటంతోపాటు, సానుకూల పరిస్థితులు ఉంటాయని అభ్యర్థులంతా భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇచ్చేవిధంగా టిడిపి అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని భావించినట్లు సమాచారం. సమావేశం జరుగుతుండగానే మాజీ మంత్రి పితాని చంద్రబాబుతో ఇదే అంశంపై ఫోన్లో మాట్లాడినట్లు తెలిసింది. పొత్తులో బిజెపికి కేటాయించామని చంద్రబాబు చెప్పగా, రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇవ్వకపోతే ఇబ్బందులు ఏర్పడతాయని పితాని వివరించినట్లు తెలుస్తోంది. మరోసారి మూడు పార్టీల నేతలు సమావేశమై చర్చిస్తామని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. ఎంఎల్ఎ అభ్యర్థులకు బిజెపి లోక్‌సభ అభ్యర్థి ఎటువంటి ఆర్థికసాయం చేయనని చెప్పడం కారణంగానే అభ్యర్థులంతా తిరుబాటుకు దిగారని తెలుస్తోంది.

**టిడిపి తీరుపై చర్చ**

టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం లోకసభ స్థానాన్ని బిజెపి దక్కించుకుంది. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి నరసాపురం ఎంపీగా రఘు రామకృష్ణంరాజు గెలిచినప్పటికీ ఆయన టిడిపి, బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ, సొంత పార్టీ వైసిపిపై తీవ్ర విమర్శలు గుప్పించిన పరిస్థితి నెలకొంది. 2024 ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా తానే పోటీ చేస్తానంటూ అనేక సార్లు ఆయనే స్వయంగా ప్రకటించిన పరిస్థితి నెలకొంది. టిడిపి లేక బిజెపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేస్తారని అంతా భావించారు. బిజెపికి టిక్కెట్ కేటాయించడంతో ఆ పార్టీ నుంచి ఆయన పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ బిజెపి శ్రీనివాసవర్మకు టిక్కెట్ కేటాయించింది. దీంతో రఘురామకృష్ణంరాజు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విజయనగరం లోకసభ, ఉండి ఎంఎల్ఎ టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని మరో ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో బిజెపి లోకసభ అభ్యర్థి తమకొద్దంటూ టిడిపి, జనసేన అభ్యర్థులు తిరుబాటు చేయడం జిల్లా రాజకీయల్లో పెనుసంచలనంగా మారింది. రఘురామకృష్ణంరాజు పట్ల టిడిపి వ్యవహారశైలి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ రఘు రామకృష్ణంరాజు ఏపార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

# పొట్ట కూటికోసం వెళ్తూ..

**ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి**

**ప్రజాశక్తి - ఆగిరిపల్లి**

పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తూ ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన గన్నవరం మండలం, వీరపనేనిగూడెం సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం, చిన్నాగిరిపల్లి గొల్లగూడెంకు చెందిన మహిళా కూలీలు గన్నవరం మండలం, తెంపల్లి గ్రామంలోని ఓ రైతుకు ప్రత్తి పంట పని నిమిత్తం ప్రతిరోజు గొల్లగూడెం నుంచి ఆటోలో తెంపల్లి వెళ్తుంటారు. మంగళవారం ఉదయం గొల్లగూడెం నుంచి కూలీలను ఎక్కించుకొని బయలుదేరిన ఆటో వీరపనేనిగూడెం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వీర్ల కృష్ణకుమారి (బుజ్జి) (50), వీర్ల సుజాత (29) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలినవారు గాయాలపాలయ్యారు. మృతులు కృష్ణకుమారికి కుమారుడు, కుమార్తె కాగ, సుజాతకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు, కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారధి పిన్నమనేని ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సంఘటన పట్ల చిన్నాగిరిపల్లి గొల్లగూడెంలో తీవ్ర విషాదఛాయలు అలుముకొన్నాయి.

**మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : వ్యకాస**

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆగిరిపల్లి మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జె.శౌరి, బాయమ్మ పాల్గొన్నారు.

# సువిధ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి

**కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

**ప్రజాశక్తి - ఏలూరు**

ఎన్నికల ప్రచారానికి సంబంధించి వివిధ అనుమతులకోసం సువిధ పోర్టల్‌లో అందిన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి అనుమతులు జారీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై రిటర్నింగ్ అధికారులు సంబంధిత నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఎన్నికల అనుమతులను ప్రోసెస్ చేయడానికి సింగిల్ విండో విధానంగా భారత ఎన్నికల సంఘం ప్రారంభించిన సువిధ పోర్టల్ ద్వారా రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతి కోరుతూ చేసిన అభ్యర్థనలను క్షుణంగా పరిశీలించి, ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు జారీ చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా పరిశీలించాలి : ఎఎస్‌పి

**ప్రజాశక్తి - చింతలపూడి**

చెక్‌పోస్టుల వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేసి గంజాయి, నాటుసారా, మద్యం, నగదును అక్రమ రవాణా జరగకుండా అరికట్టాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి జి.స్వరూపరాణి సిబ్బందికి సూచించారు. చింతలపూడి మండలం అల్లిపల్లి, లింగగూడెం చెక్‌పోస్ట్‌లను ఎఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా జిల్లా అదనపు ఎస్‌పి స్వయంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నియమ నిబంధనలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వారి ఆదేశాలపై జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాలపై 8 చెక్‌పోస్టులను మండలంలోని అల్లిపల్లి, గురుభట్ల గూడెం, టి.నర్సాపురం, జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం, వేలారుపాడు మండలం మేడపల్లి, కుకునూరు మండలం శ్రీధర్ వేలేరు, చాట్రాయి మండలం పర్వతీపురం, కృష్ణారావు పాలెంలో సాయుధ దళాలతో నిరంతరం చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు.

స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో, మిగిలిన ఏడు చెక్‌పోస్టులను సాయుద దళాలు పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏర్పాటు చేసిన సదరు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ ఎటువంటి అక్రమ రవాణానికి తావు లేకుండా విధి నిర్వహణ చేస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి జారిన తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉపాధి పనులు కల్పించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ**

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఎం.జీవరత్నం అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ రాజకీయ సౌలభ్యం కోసం ఏలూరు నగరంలో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం వల్ల ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు ఉపాధి దొరక్క వలసలు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వలసల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఈ గ్రామాల్లో నిర్వహించకపోవడం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా డ్వామా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళీ రావు, సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# జీవశాస్త్రం పరీక్షకు 23,434 మంది హాజరు

**డిఇఒ ఎస్.అబ్రహం**

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

పదవ తరగతి పబ్లిక్ పరీక్ష జీవశాస్త్రం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జీవశాస్త్ర పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 24 వేల 131 మంది హాజరు కావలసి ఉండగా, 23,434 మంది హాజరయ్యారన్నారు. 697 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. హాజరు శాతం 97.11గా నమోదైంది. ఇక ప్రయివేట్ విద్యార్థుల విషయానికి వస్తే 5,285 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 3,108 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 2,177 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 139 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లాస్థాయి అబ్జర్వర్ ఆరు పరీక్ష కేంద్రాలు, ఫ్లైయింగ్ స్క్వార్డ్ 40 పరీక్ష కేంద్రాలు, జిల్లా విద్యాశాఖ అధికారి నాలుగు పరీక్ష కేంద్రాలు తనిఖీ చేశారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 3 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా మొత్తం జిల్లా వ్యాప్తంగా 53 పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

# ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**చింతలపూడి:** రాజకీయ పార్టీ కార్యక్రమాలలో పాల్గొని ఒక రాజకీయ పార్టీకి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయునికి జిల్లా విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు అందజేసి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు. చింతలపూడి మండలం కంచనగూడెం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జిటి కె.చెంచం రాజు ఒక రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొని, ఉమ్మడి పొత్తు పార్టీకి సపోర్ట్ చేయాలని ప్రసంగిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసులు ఇచ్చి సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు.

# రెండో రోజు భువనేశ్వరి పర్యటన

**ప్రజాశక్తి - టి నరసాపురం**

నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి రెండో రోజు బుధవారం టి.నరసాపురం మండలంతో పాటు ఉంగుటూరు, తాడేపల్లినియోజకవర్గాల్లో పర్యటించనున్నారని మక్కినవారిగూడెం సర్పంచి మెతుకుమిల్లి గోపాలరావు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. చంద్రబాబును జైలులో పెట్టారని మనస్తాపంతో మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన అబ్బదాసరి కృష్ణ మృతి చెందాడని, నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా భువనేశ్వరి మండలంలో పర్యటించి ఆయన సభ్యులను ఓదార్చుతారని ఆయన తెలిపారు.

## జీవశాస్త్రం పరీక్షకు 1093 మంది హాజరు

**ప్రజాశక్తి - కలిదిండి**

మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలలో జరిగిన పదవ తరగతి జీవశాస్త్రం పరీక్షకు 1093 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు తెలిపారు. మండలంలో మొత్తం 1,211 మందికి గాను 1093 హాజరు కాగా 118 మంది గైర్హాజరయ్యారని ప్రభాకర బాబు తెలియజేశారు.

**పోలవరం :** మండలంలో పది పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. గూటాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 156 మంది విద్యార్థులకు 120 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మందికి 256 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు జూరెడ్డి చంద్రశేఖర్, మూర్తి తెలిపారు.

## నాగేంద్ర మృతికి సంతాపం

**కామవరపుకోట:** రైస్‌మిల్ యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే నాగేంద్ర మృతి యూనియన్‌కు తీరని లోటు అని యూనియన్ గౌరవాధ్యక్షుడు టివిఎస్ రాజు, జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు విచారాన్ని వ్యక్తం చేశారు. కామవరపుకోట రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు మేనుగుల దుర్గారావు కుమారుడు రైస్‌మిల్ వర్కర్ మేనుగుల నాగేంద్ర తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు. నాగేంద్ర మృతికి సంతాప సూచికంగా కామవరపుకోట రైస్ మిల్ యజమానులు రైస్ మిల్లులను బంద్ చేసి తమ సంతాపం తెలియజేశారు.

## మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి

**ముదినేపల్లి:** ప్రతి పోలింగ్ బూతుల్లో మౌలిక వసతులు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తదితర సౌకర్యాల కల్పనపై సెక్టోరల్, నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కైకలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్ తెలిపారు. మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు, పెదపాలపర్రు గ్రామాల్లోని పలు పోలింగ్ బూత్‌లను ఆయన మంగళవారం తనిఖీ చేశారు.

## 'టిడిపి అభ్యర్థిని గెలిపించాలి'

**ఏలూరు సిటీ:** ఉమ్మడి జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి బడేటి చంటిని గెలిపించాలని రెడ్డి అప్పలనాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పడిన కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూటమి అభ్యర్థిని గెలిపించాలని టిడిపి నాయకులకు, జనసేన శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

# సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం!

**సమయపాలన పాటించని వైనం**
**స్థానికంగా నివాసం ఉండని సిబ్బంది**
**ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ప్రజల వద్దకు పాలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఆచరణలో అభాసుపాలవుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విధులు నిర్వహించాలి. సిబ్బంది కార్యాలయానికి ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో? తెలియని పరిస్థితి. మండలంలో 21 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయానికి కార్యాలయానికి హాజరుకావడం లేదని, ఉదయం 11 గంటలు అయినప్పటికీ సిబ్బంది రాకపోవటంతో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు చెబుతున్నారు. పేరూరు సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పేరూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం పరిశీలన చేయగా సచివాలయంలో 9 మంది సిబ్బంది పని చేస్తున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యారు. హాజరైన వారు కూడా సమయపాలన పాటించలేదు. తొమ్మిది మంది సిబ్బంది ఉన్నా సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్, విఆర్ఒ విధులకు హాజరయ్యారు. మిగతా సిబ్బంది పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళ పోలీసు, గ్రామ వ్యవసాయ సహాయకులు, మత్స్యశాఖ సహాయకులు, ఎఎన్ఎం, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకపోవడటంతో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు




తాళం వేసి వున్న సచివాలయ కార్యదర్శి గది

గ్రామీణ ప్రాంత సచివాలయాలలో పనిచేసే సిబ్బంది స్థానికంగా నివాసముండాలి. కానీ ఎక్కడా అమలు జరగడం లేదు. అందుబాటులో లేకపోవడం సిబ్బంది పనితీరుకు, నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. సచివాయాలలో సిబ్బంది సమయ పాలన లేకపోవడంతో ప్రజలు వారికోసం ఎదురుచూపులు చూస్తున్నారు. మండలంలోని పలు సచివాలయాల్లో పనుల కోసం వచ్చే ప్రజలు సిబ్బంది కోసం పడిగాపులు కాస్తున్నారు. అధికారులు స్పందించి సచివాలయానికి అధికారులు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపిడిఒ ఎన్. మురళీ గంగాధరరావును వివరణ కోరగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పోలీసుల కవాతు

**పోలవరం:** ఓటర్లను చైతన్యపరచడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు(ఫ్లాగ్ మార్చ్)ను పోలవరం పోలీసులు బుధవారం నిర్వహించారు. పోలవరం సబ్ డివిజన్ డిఎస్‌పి ఎన్.సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలవరం సిఐ జి.మధు బాబు ఆధ్వర్యంలో గూటాల, కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ, ఎల్ఎన్‌డి పేట గ్రామాల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ధైర్యం కలిగించడానికి కవాతు నిర్వహించినట్లు తెలిపారు.



## అమలుకాని ఎన్నికల కోడ్

**ఏలూరు అర్బన్:** ఏలూరు వసంత మహల్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శిలాఫలకంపై స్థానిక రాజకీయ నాయకుల పేర్లు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేయట్లేదు.

## 'స్పందన' ఫిర్యాదుపై విచారణ

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

సొసైటీ వాటర్ ప్లాంట్ మూయడానికి కారణాలు తెలపాలని, ప్లాంట్‌లో పనిచేసే సిబ్బందికి న్యాయం చేయాలని, సొసైటీలో విలువైన సామాగ్రి చోరీకి బాధ్యులు నష్టాన్ని వసూలు చేయాలని కోరుతూ ఇటీవల వేసిన ఫిర్యాదుకు విచారణ చేపట్టారు. టి.నరసాపురం గ్రామానికి చెందిన డి.విల్సన్ బాబు ఫిర్యాదు చేయడంతో జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు మంగళవారం విచారణ చేపట్టారు.

## 'ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి'

**ఏలూరు అర్బన్:** కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యలకు కారకులైన రెవెన్యూ అధికారులపై, అధికార పార్టీ నాయకులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుబ్బారావు పొలాన్ని రెవెన్యూ అధికారులు వైసిపి నాయకులకు తప్పుడు పత్రాలు ద్వారా అప్పగించడాన్ని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఆత్మహత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కన్నయ్య డిమాండ్ చేశారు.



## 'డిఎన్ఆర్‌ను గెలిపించాలి'

**ముదినేపల్లి:** రానున్న ఎన్నికల్లో కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కొరగుంటపాలెం ఇంటింటా ప్రచారంలో డిఎన్ఆర్ కోడలు స్వాతి అన్నారు.

## భీమడోలులో అన్నసమారాధన

**భీమడోలు:** ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మంగళవారం మండల కేంద్రమైన భీమడోలులో పర్యటించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని శివాలయంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాట్రేనిపాడులో ఆత్మీయ సమావేశం

**ముసునూరు:** కాట్రేనిపాడు గ్రామంలో ఆత్మీయ సమావేశంలో కొలుసు పార్థసారథి పాల్గొని గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కార మార్గాలను చూపుటకు ముందు ఉంటానని మీ మనిషిగా ఆదరించి గెలిపించాలని కోరారు.

## అజయ్‌కు పరామర్శ

**చాట్రాయి:** జనార్ధనవరం గ్రామ టిడిపి కార్యదర్శి బలువూరి రత్తయ్య కుమారుడు అజయ్ వెన్నెముక చికిత్స చేయించుకొని ఇంటికి రాగ మంగళవారం జిల్లా టిడిపి నాయకులు పరామర్శించారు. తెలుగురైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరావు(చిట్టిబాబు) పరామర్శించారు.

## గుండెపోటుతో ఆంధ్రప్రభ విలేకరి మృతి

**ఏలూరు స్పోర్ట్స్:** ఆంధ్రప్రభ క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న శ్రవణం మణికంఠ గుండెపోటుతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఏలూరు నగరంలోని చాటపర్రు ప్రాంతానికి చెందిన శ్రవణం మణికంఠ(33) గత కొన్నేళ్లుగా ఏలూరు ఆంధ్రప్రభ క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం హఠాత్తుగా ఆయన అనారోగ్యం పాలు కావడంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు.

## 'చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేయాలి'

**బుట్టాయగూడెం:** నాటుసారా క్రయ, విక్రయాలు చేయకుండా నిరోధించడానికి ఇంటర్ స్టేట్ చెక్ పోస్ట్‌ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల రవాణాను అరికట్టుటకు రెవెన్యూ, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ శాఖ అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఆదేశించారు.

## 'కొందరి వల్ల టిడిపి ఓటమి'

**ప్రజాశక్తి - ముసునూరు**

నూజివీడు నియోజకవర్గంలో కొందరి నాయకుల వల్లే టిడిపి ఓటమి పాలవుతోందని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. జంగంగూడెం గ్రామంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తనని గెలిపించాలని కోరారు.

## 'ఆక్రమణలు తొలగించాలి'

**పోలవరం:** నెక్లెస్ బండ్‌కి మేజర్ డ్రయినేజీ నిర్మించి ఆక్రమణలు తొలగించాలని టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ ఉపసర్పంచి మంగిన కొండ డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన పోశీరత్నం, మేడూరి పార్వతి, పట్నాల దేవి మాట్లాడుతూ నెక్లెస్ బండికి పొడవునా మేజర్ డ్రయినేజీ నిర్మించకపోవడం వల్ల వర్షాల సీజనులో నీరు నిలిచి ప్రజలు అవస్థలకు గురవుతున్నారని, నెక్లెస్ బండ్‌కి పొడవునా జరిగిన ఆక్రమణలు తొలగించి, మేజర్ డ్రయినేజీ నిర్మించాలని కోరారు.

### మృతురాలి కుటుంబానికి పరామర్శ

**ముసునూరు :** కాట్రేనిపాడు గ్రామంలోని అంగడాల భవాని ఇటీవలే పాము కాటుతో నూజివీడు అమెరికన్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందడంతో కొలుసు పార్థసారథి వారి కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలుగా సహాయ పడతానని భరోసా ఇచ్చారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు ఉన్నారు.